క్లుప్తంగా

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గ్రామంలో ఉన్న శ్రీక్షేత్రంలో శనివారం అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్, చామర్తి రమేష్‌లు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ హోమం



లక్ష్మీ హోమం నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్తలు

విజయనగరం రూరల్: మండలంలోని సారిక పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీరామ నారాయణం ఆలయంలో శ్రీవరసిద్ధి వినాయక నవరాత్రులను పురస్కరించుకుని శనివారం శ్రీలక్ష్మీ హోమాన్ని ఆలయ ధర్మకర్తలు నారాయణం శ్రీనివాస్ దంపతులు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయం మేనేజర్ రమణ, అర్చకులు పాల్గొన్నారు.

మహాగణపతికి మహానివేదన



మహాగణపతికి 251 స్వీట్లతో మహా నివేదన

విజయనగరం టౌన్: నగరంలోని కమ్మవీధిలో స్థానిక కార్పొరేటర్ గుజ్జల నారాయణ రావు, స్థానిక పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాగణపతికి శనివారం 251 రకాల తీపి పదార్థాలతో నివేదన చేశారు. స్వామివారికి ప్రీతికరమైన లడ్డూలను సమర్పించారు. సాయంత్రం భగవతి నృత్య కళామందిర్ విద్యార్థినులు చేసిన నృత్యప్రదర్శన ఆద్యంతం ఆహుతులను అలరించింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గణనాథునికి గానార్చన



గణనాథునికి గానార్చన చేస్తున్న డాక్టర్ స్వప్నహైందవి

విజయనగరం టౌన్: మహాగణపతి నవరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని శనివారం రాత్రి రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి నిర్వహించిన గానార్చన భక్తులను ఆద్యంతం భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. స్థానిక కొత్తపేట బుక్కావీధిలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారకభవనంలో కొలువుదీరిన గణనాథునికి స్వరార్చన చేశారు. అన్నమాచార్య కీర్తనాలాపనతో అలరించారు. అనంతరం ఆమెను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దవళ సర్వేశ్వరరావు, మువ్వ హరి, యామిజాల ప్రభు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల హెచ్చరిక



చాకలిపేట చెరువు వద్ద ఏర్పాటుచేసిన బ్యానర్

విజయనగరం క్రైమ్: జిల్లా పరిధిలో గణపతి నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చెరువులు పూర్తిగా నీటితో నిండి ప్రమాదకరంగా ఉండడంతో చిన్నపిల్లలు, ఈత రానివారు చెరువుల్లోకి దిగరాదంటూ హెచ్చరికలు జారీ చేయడంతో పాటు నిమజ్జనాలు చేసే చోట ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటుచేశారు. నిమజ్జనాలు జరిగే ప్రదేశాల్లో పోలీస్ సిబ్బంది ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఈత వచ్చిన వారినే ఒడ్డు నుంచి నిమజ్జనం చేసేలా స్వీయ పర్యవేక్షణ చేస్తుండడంతో కమిటీల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అదుపుతప్పితే అంతే..



పూసపాటిరేగలో బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న విద్యార్థులు

- పూసపాటిరేగ నుంచి ప్రయాణం విద్యార్థులకు నరకమే
- సరిపడా బస్సులు లేకపోవడంతో నిత్యం అవస్థలు
- ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణం

పూసపాటిరేగ: పెరిగిన జనాభాకు అనుగుణంగా రవాణా సౌకర్యాలు మెరుగుపడకపోవడంతో విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు నరక యాతన పడుతున్నారు. పూసపాటిరేగ నుంచి నిత్యం 3 వేల మంది విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వస్తుంటారు. ఉదయం 6 నుంచి 8 గంటలు, సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్య విద్యార్థులకు సరిపడా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి కళాశాలకు చేరుకునేందుకు కొందరు విద్యార్థులు ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. మరికొందరు అధిక ఛార్జీలు చెల్లించి ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

పూసపాటిరేగ జంక్షన్ నుంచి రణస్థలం, చింతపల్లి, తిప్పలవలస, భోగాపురం వైపు వెళ్లే బస్సులలో ఎక్కాలంటే హడలిపోవాల్సిందే. పూసపాటిరేగలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో సుమారు 3 వేల మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. వారంతా స్టూడెంట్ బస్‌పాస్ తీసుకుని నిత్యం బస్సుల్లోనే ఇళ్ల నుంచి కళాశాలకు, కళాశాల నుంచి ఇళ్లకు రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే సుమారు 2 వేల మంది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు వివిధ ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. వీరంతా ఉదయం, సాయంత్రం సమయంలో బస్సుల కోసం రహదారిపై నిరీక్షిస్తూ కనిపిస్తారు. వచ్చిన బస్సులో ఎక్కేందుకు వారంతా పోటీపడాల్సి వస్తోంది. ప్రయాణికులతో బస్సులు కిక్కిరిసి పోవడంతో ఫుట్‌బోర్డులపై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి పూసపాటిరేగ మీదుగా మరిన్ని సర్వీసులు నడపాలని విద్యార్థులు, ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు.

పట్టుతప్పితే పరలోకానికే



నిత్యం పూసపాటిరేగలో కళాశాలకు వచ్చినప్పుడు కిక్కిరిసిన ప్రయాణం చేస్తున్నాం. చాలీచాలని బస్సులు వేయడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు సరిపడా బస్సులు వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఆర్టీసీ అధికారులు కొత్త సర్వీసులు వేసి విద్యార్థులకు సహకరించాలి.

– శ్రీనివాస్, విద్యార్థి, పైడిబీమవరం

విద్యార్థుల అవస్థలు పట్టించుకోవాలి



బస్సులు లేక విద్యార్థులు పడుతున్న అవస్థలు పట్టించుకోవాలి. దూర ప్రాంతం నుంచి వచ్చి పూసపాటిరేగలో విద్యను అభ్యసిస్తున్న ప్రతీ విద్యార్థి బస్సుల్లో ప్రయాణం చేయలేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విద్యార్థులకు కళాశాలలకు వచ్చే సమయంలో, తిరిగి వెళ్లే సమయంలో అదనపు బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మణికంఠ, విద్యార్థి, కందివలస

మహాభాష్యం శంకర్ మృతి తీరనిలోటు



మహాభాష్యం శంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీనియర్ జర్నలిస్టులు

విజయనగరం టౌన్: సీనియర్ జర్నలిస్ట్ మహాభాష్యం శంకర్ మృతి తీరని లోటని సీనియర్ జర్నలిస్టులు రాధాకృష్ణ, శివప్రసాద్, గమిడి కోటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఎన్‌సీఎస్ రోడ్డులో ఉన్న ఫుడ్ బ్యాంక్ వద్ద శ్రీగౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్ కాండ్రేగుల శేఖర్, సహచర జర్నలిస్టులతో కలిసి శనివారం శంకర్ స్మృత్యర్థం అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం వహించి శ్రద్ధాంజలి ఘటించారు. శంకర్ వ్యక్తిత్వాన్ని, ఆయన మంచితనాన్ని, ఆయన అందించిన సహాయ సహకారాలు, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఎంఎంఎల్ నాయుడు, లక్ష్మణరావు, ఎలిశెట్టి సురేష్, పంచాది అప్పారావు, గురుప్రసాద్, చౌదరీ, జైరాజ్, డీపీఆర్‌ఓ కెమెరామెన్ మురళి, శ్రీగౌరీ సేవా సంఘం ప్రతినిధులు కనిశెట్టి సుధాకర్, మొల్లేటి నాయుడు, ఆడారి వెంకటరమణ, కాళ్ల ప్రసాద్, బొడ్డేటి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర నాయకులు బెహరా శంకరరావు, తదితరులు

విజయనగరం టౌన్: పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాలని కోరుతూ ఏఐఎఫ్‌టీయూ(న్యూ) నాయకులు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర నాయకులు బెహరా శంకరరావు ఆధ్వర్యంలో శనివారం పారిశ్రామిక వాడలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల అచ్యుతాపురం పరవాడలో ఎసెన్షియా, సినర్జిస్ ఫార్మా కంపెనీల్లో 22 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడానికి, పదుల సంఖ్యలో కార్మికులు తీవ్ర గాయాల పాలవ్వడానికి ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాయడమే కారణమన్నారు. కర్మాగారాల చట్టాన్ని పటిష్టపర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇన్‌చార్జిలతో కాకుండా రెగ్యులర్ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌వైఎస్ నాయకులు ఎం.అప్పలరాజు, సోమరాజు, తిరుపతిరాజు, చిన్నారావు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

విజయనగరం క్రైమ్: మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవ్వడం లేదా ఇతర వాహనాలను ఢీకొట్టి ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. ఇటువంటి వారిని కట్టడి చేసేందుకు ప్రతీరోజూ విజిబుల్ పోలీసింగ్ ప్రత్యేక డ్రైవ్‌గా చేపడుతున్నట్లు తెలిపారు. డ్రంక అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10 వేలు జరీమానా విధిస్తున్నామన్నారు. ఇప్పటివరకూ 25 మందిపై కేసులు నమోదుచేసి వారికి రూ.10వేలు చొప్పున జరీమానా విధించినట్లు వెల్లడించారు.

గంజాయి నియంత్రణకు సహకరించాలి

- డీఎస్పీ ఆర్.గోవిందరావు



ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైమ్: గంజాయి నియంత్రణకు ఆర్టీసీ ఉద్యోగులు సహకరించాలని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు కోరారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో శనివారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు నిర్వహించిన కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి రవాణాకు పాల్పడే నిందితులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి గంజాయిని తరలించేందుకు రవాణా వాహనాలనే ఎక్కువగా వినియోగిస్తున్నారన్నారు. తక్కువ వ్యయంతో ఆర్టీసీ, ఇతర వాహనాల్లో ప్రయాణించి గమ్యస్థానాలకు గంజాయిని తరలిస్తున్నారన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను ఆర్టీసీ ఉద్యోగులు గమనించి వెంటనే సమాచారమందించాలని కోరారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఆర్టీసీ డిపోమేనేజర్ వి.శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్రకచేరీ



గాత్రకచేరీ నిర్వహిస్తున్న సంపత్ బృందం

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన ఎస్‌వీఎస్ సంపత్ గాత్ర కచేరీ ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. వయోలిన్‌పై కె.శ్రీరామ్, మృదంగంపై వి.గణేష్, మోర్సింగ్‌పై పి.వెంకటరావు సహకారం అందించారు. అదేవిధంగా ద్వారం సత్యనారాయణరావు వయోలిన్ సోలో అలరించింది. ఆయనకు వయోలిన్‌పై ఎం.నీలాద్రి రావు, మృదంగంపై పెరవలి జయభాస్కర్, ఘటంపై ఎం.సూర్యప్రసాదరావు సహకరించారు. కార్యక్రమాలను కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి పర్యవేక్షించారు.

మందుగుండు సామగ్రి పట్టివేత

విజయనగరం క్రైమ్: టూటౌన్ పరిధిలో స్థానిక రాజారావు మేడ సమీపంలో అనుమతుల్లేకుండా అమ్మకాలు చేపడుతున్న మందుగుండు సామగ్రిని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.20 వేల విలువైన మందుగుండు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ టి.శ్రీనివాసరావు తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

విజయనగరం క్రైమ్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) విభాగాన్ని రద్దు చేసి ఎక్సైజ్ శాఖను పునర్‌వ్యవస్థీకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎక్సైజ్ శాఖ సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ ఆవరణలో, నెల్లిమర్ల డిపో వద్ద జిల్లా ఎక్సైజ్ అధికారి, డిపో మేనేజర్ ఎన్‌వీ రమణ, అసిస్టెంట్ మేనేజర్ ఆర్.ధనుంజయ్ శనివారం సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎక్సైజ్ శాఖ పునర్ వ్యవస్థీకరణకు సహకరించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు ఉమ్మడి జిల్లాలో ఉన్న తొమ్మిది మంది ఎమ్మెల్యేలకు ఎక్సైజ్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

సందడిగా గణనాథుని నిమజ్జనం

డెంకాడ: మండలంలోని సింగవరంలో ఎస్సీ కాలనీలో వినాయక నిమజ్జనోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ యువజన సేవా ఆధ్వర్యంలో గణనాథుని విగ్రహాన్ని ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో గణపతిని గంగమ్మ ఒడికి చేర్చారు.

ఎట్టకేలకు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్...

విజయనగరం రూరల్: మండలంలోని ద్వారపూడి గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లే దారిని అధికార పార్టీ నాయకులు బాగుచేశారు. సాక్షి పత్రికలో శనివారం 'మరుభూమికి మార్గం కరువు' అనే శీర్షికతో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు, నాయకులు స్పందించారు. సచివాలయ సిబ్బందితో పాటు స్థానిక అధికార పార్టీ నాయకులు శనివారం జేసీబీతో శ్మశానానికి వెళ్లే మార్గంలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



శ్మశానానికి వెళ్లే దారి గతంలో ఇలా..



పిచ్చిమొక్కలు తొలగించాక

పనిచేస్తున్న ఎక్స్‌రే యంత్రం

సాక్షి ఎఫెక్ట్...

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్ పాడవడంతో రోగులు ఇబ్బంది పడుతున్న విషయంపై ఈ నెల 12న సాక్షిలో ప్రచురితమైన 'సర్వజన ఆస్పత్రిలో పనిచేయని ఎక్స్‌రే' కథనానికి ఆస్పత్రి అధికారులు స్పందించారు. వెంటనే ఎక్స్‌రే యంత్రాన్ని బాగుచేయించారు. శనివారం నుంచి వినియోగంలోకి తీసుకురావడంతో ఎక్స్‌రే కోసం వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పాయి.



రోగికి ఎక్స్‌రే తీస్తున్న టెక్నీషియన్

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నిరసన



నిరసన తెలియజేస్తున్న స్టాఫ్ నర్సులు

విజయనగరం ఫోర్ట్: కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని స్టాఫ్ నర్సులు నాగలక్ష్మి, వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద శనివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీఓ 115ను తక్షణమే రద్దు చేయాలని, నర్సుల హక్కులను కాపాడాలని కోరారు. ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న నర్సులందరినీ రెగ్యూలర్ చేయలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజని, సంధ్య, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చనలలో పాల్గొన్న మహిళలు

విజయనగరం టౌన్: స్థానిక హుకుంపేటలో ముత్యాల గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దశవతార వినాయక మండపం వద్ద శనివారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. సుమారు వంద మంది మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యుడు లెంక సురేష్ మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా 21 రోజుల పాటు ఘనంగా చవితి వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది దశవతార వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా ఈ నెల 17న మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అత్యంత వైభవంగా ఊరేగింపుతో నిమజ్జనం చేస్తామని, భక్తులందరూ ఆయా కార్యక్రమాల్లో పాల్గొని గణనాథుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

వరద బాధితులకు విరాళాలు



మంత్రి శ్రీనివాస్ చేతుల మీదుగా కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం ఫోర్ట్: వరద బాధితులను ఆదుకొనేందుకు దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేస్తున్నారు. పట్టణంలోని హోల్ సేల్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ రూ.1 లక్ష, నేతాజీ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ రూ.1,00,123లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ విజయనగరం రూ.2.50 లక్షలు విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని శనివారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతులమీదుగా జిల్లా కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు, పెద్దింతి గణపతి రావు, ఎమ్‌వీ చలం, వీవీ శ్రీనివాసరావు, బొడ్డు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

28 నుంచి స్టూడెంట్స్ ఫెస్ట్



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

విజయనగరం పూల్‌బాగ్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురజాడ కళాక్షేత్రంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న భగత్ సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మోహన్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి శనివారం స్థానిక ఎల్‌బీజీ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఈ ఫెస్ట్‌కు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో భాగంగా మూడురోజుల పాటు యువత చేపట్టాల్సిన విధివిధానాలను ఫ్లాష్ మాబ్స్ ద్వారా వివరిస్తామన్నారు. యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు డి.రాము, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరికి మున్సిపల్ కార్మికుల సంతాపం

నెల్లిమర్ల: సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరికి మున్సిపల్ కార్మికులు సంతాపం తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కిల్లంపల్లి రామారావు, యూనియన్ నాయకులు బాబూరావు, హరిబాబు, శ్రీను, రాము, లక్ష్మిలు ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏచూరి మృతి కార్మిక వర్గానికి, అభ్యుదయ శక్తులకు, వామపక్ష ఉద్యమాలకు, మతసామరస్యాన్ని కోరుకునే లౌకికవాదులకు తీరని లోటన్నారు. గొప్ప మానవతావాదిని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. సంతాప కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.